నమస్తే తెలంగాణ
నల్లగొండ
5 | నల్లగొండ, బుధవారం 10 జనవరి 2024 | NALGONDA

క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి

విశ్రాంత ఉద్యోగుల సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ

రామగిరి, జనవరి 9 : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం నూతన సంవత్సరం క్యాలెండర్, డైరీని శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి మంగళవారం తన నివాసంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గుంటకండ్ల దామోదర్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు గానూతల వెంకట్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి జెల్లా శ్రీశైలం, నల్లగొండ మండల ప్రధాన కార్యదర్శి యాద వాసుదేవ్, నాయకులు ముత్యాల కృష్ణ, అజం అలీ, ఎండీ అలీ, పుల్లయ్య పాల్గొన్నారు.

గ్యారెంటీలు మాత్రమే!

ఇతర దరఖాస్తులు ఆన్‌లైన్ చెయ్యట్లే

ఆప్షన్ లేకపోవడంతో పక్కన పడేస్తున్న ఆపరేటర్లు

- దరఖాస్తుల డేటా ఎంట్రీలోనూ సర్వర్ సమస్యలు
- ఉమ్మడి జిల్లాలో వచ్చిన దరఖాస్తులు 11.52 లక్షలు
- ఐదు రోజుల్లో ఆన్‌లైన్ చేసినవి 5.22 లక్షలు
- సీఎం చెప్పినా కొత్తగా వచ్చిన దరఖాస్తుల తిరస్కరణ
- ఈ నెల 17వరకు ఎంట్రీ పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశం

నల్లగొండ ఉమెన్స్ కాలేజీలో ప్రజాపాలన దరఖాస్తుల డేటాను ఆన్‌లైన్ ఎంట్రీ చేస్తున్న సిబ్బంది

నల్లగొండ, జనవరి 9 : ప్రజా పాలన దరఖాస్తుల ఆన్‌లైన్ నమోదు ప్రక్రియ మందకొడిగా సాగుతున్నది. ఐదు రోజులుగా డేటా ఎంట్రీ జరుగుతున్నప్పటికీ సర్వర్ సమస్యతో ఆలస్యమవుతున్నది. గత నెల 28 నుంచి ఈ నెల 6 వరకు ప్రజా పాలన దరఖాస్తుల స్వీకరణ జరుగగా, ఈ నెల 5 నుంచి ఆన్‌లైన్ డేటా ఎంట్రీ ప్రారంభమైంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 11.52 లక్షల దరఖాస్తులు రాగా ఈ ఐదు రోజుల్లో 5.22 లక్షల దరఖాస్తులు ఆన్‌లైన్ అయ్యాయి. ఇంకా 6.30 లక్షలు ఆన్‌లైన్ చేయాల్సి ఉన్నది. అయితే ఈ నెల 17 వరకు పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. ప్రస్తుతం గ్యారెంటీలకు సంబంధించి మాత్రమే ఆన్‌లైన్ అవుతుండగా మిగిలిన దరఖాస్తులకు సైట్‌లో ఆప్షన్ లేకపోవడంతో వాటిని పక్కన పెడుతున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 18 మున్సిపాలిటీలు, 71 మండలాల్లోని తాసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయాల్లో ఈ ఆన్‌లైన్ ప్రక్రియ 3,845 మంది ఆపరేటర్లతో నడుస్తున్నది.

ఐదు పథకాలకే..

ప్రజా పాలన కార్యక్రమంలో ఐదు గ్యారెంటీల కింద మహాలక్ష్మి, రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, గృహ జ్యోతి, చేయూత పథకాలకు దరఖాస్తులు స్వీకరించారు. దరఖాస్తుకు కుటుంబ సభ్యులకు సంబంధించిన ఆహార భద్రత కార్డుతోపాటు ఆధార్ కార్డు జిరాక్స్‌లను జత చేశారు. చాలా మంది ఆశావహులు తమకు రేషన్ కార్డు లేకపోవడంతో ప్రభుత్వ ఆదేశంతో తెల్ల కాగితంపై కుటుంబ సభ్యుల వివరాలు రాసి ఇచ్చారు. ఈ నేపథ్యంలో నల్లగొండ జిల్లా వ్యాప్తంగా తెల్లరేషన్ కార్డులు కావాలని 74వేల మంది, ఇతర బెన్‌ఫిట్స్ కావాలని మరో 12వేల మంది దరఖాస్తు చేసుకున్నారు. అంటే ఐదు గ్యారెంటీలు కాక మరో 86,409 మంది ఇతర పథకాలు కావాలని దరఖాస్తు చేసుకున్నారు. ఐదు పథకాలకు మాత్రమే ఆన్‌లైన్ చేసే ఆప్షన్ ఉండడంతో రేషన్ కార్డుతోపాటు ఇతర బెన్‌ఫిట్స్ కోసం దరఖాస్తు చేసుకున్న 86వేల దరఖాస్తులను పక్కన పెడుతున్నారు. దరఖాస్తులో కుటుంబ సభ్యుల వివరాలు ఎక్కువ ఉంటే డేటా ఎంట్రీ చేసే సమయంలో ఆలస్యమవుతున్నది.

అధికారుల పర్యవేక్షణలో..

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా తాసీల్దార్, ఎంపీడీఓ, మున్సిపల్ కార్యాలయాల్లో 3,845 మంది ఆపరేటర్లతో డేటా ఎంట్రీ నడుస్తున్నది. మండల స్థాయిలో తాసీల్దార్, నియోజకవర్గ స్థాయిలో ఆర్డీఓ, ఆర్డీఓ లేని ప్రాంతాల్లో ప్రత్యేక అధికారులు, జిల్లా స్థాయిలో కలెక్టర్, నోడల్ అధికారుల పర్యవేక్షణలో డేటా ఎంట్రీ కొనసాగుతున్నది. ఈ నెల 17వ తేదీలోపు డేటా ఎంట్రీ పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. ఈ నేపథ్యంలో ఈ నెల 14, 15 తేదీల్లో పండుగ సెలవులను దృష్టిలో పెట్టుకొని వేగంగా చేసేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

ఇదిలా ఉండగా గ్యారెంటీలకు సంబంధించి దరఖాస్తుల ప్రక్రియ నిరంతరం అని సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు. అయితే ఈ డేటా ఎంట్రీ జరుగుతున్న సమయంలో ఆయా మండలాలు, మున్సిపల్ కేంద్రాల్లోకి వెళ్లి కొందరు ఆశావహులు దరఖాస్తులు ఇస్తే తీసుకోవడం లేదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నల్లగొండలో స్టాండింగ్ కమిటీ సమావేశంలో పాల్గొన్న ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్, గౌరవ సభ్యులు

ప్రజా సమస్యలపై అలసత్వం తగదు

- అధికారులు, ప్రజలకు జవాబుదారీగా ఉండాలి
- స్టాండింగ్ కమిటీ సమావేశంలో జడ్పీ చైర్మన్ బండ నరేందర్‌రెడ్డి
- ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే మహిళలకు ప్రత్యేక కార్డులివ్వాలి : ఎంపీ బడుగుల

సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీ చైర్మన్ బండ నరేందర్‌రెడ్డి

నల్లగొండ, జనవరి 9 : గత సమావేశంలో సభ్యులు లేవనెత్తిన సమస్యలను ఇప్పటి వరకు ఎందుకు పరిష్కరించలేదని జిల్లా పరిషత్ చైర్మన్ బండ నరేందర్‌రెడ్డి ఆయా శాఖల అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లా పరిషత్ కార్యాలయంలో మంగళవారం నరేందర్‌రెడ్డి అధ్యక్షతన 1, 2, 4, 7వ స్థాయీ సంఘాల సమావేశాలు నిర్వహించారు. ఆయా సమావేశాల్లో ఆయన మాట్లాడుతూ జడ్పీలో సభ్యులు అడిగిన ప్రతి ప్రశ్నకు సమాధానం చెప్పడంతోపాటు వాటిని పరిష్కరించే బాధ్యతను అధికారులు తీసుకోవాలన్నారు. అలసత్వం వహిస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. అధికారులు, ప్రజలకు జవాబుదారీతనంగా ఉంటేనే చట్ట సభలు, సర్వసభ్య వేదికలపై నమ్మకం ఉంటుందన్నారు. అనంతరం రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్య యాదవ్ మాట్లాడుతూ ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించే మహిళలకు ఒరిజినల్ ఆధార్ కార్డు కాకుండా జిరాక్స్‌లకు అనుమతి ఇవ్వాలని కోరారు. లేకుంటే వారికి ప్రత్యేక కార్డులు అందజేయాలని, పల్లెలకు బస్సులు నడుపాలని అన్నారు. ఎక్స్‌ప్రెస్ సర్వీసులు మండల కేంద్రాల్లోనే ఆపడం వల్ల సమీప గ్రామాల్లో దిగేవారు ఇబ్బంది పడుతున్నారని, రాత్రి పూట ప్రయాణికులు అపమన్న చోట ఆపేలా చూడాలని ప్రభుత్వానికి సూచించారు.

మునుగోడులో బెల్ట్ షాపులు బంద్ కాలేదు..

మునుగోడు నియోజకవర్గంలో బెల్ట్‌షాపులు బంద్ చేయాలని ఎమ్మెల్యే కోమటి రెడ్డి రాజగోపాల్‌రెడ్డి చెప్పినా అన్ని చోట్లా బంద్ కాలేదని పలువురు సభ్యులు సభ దృష్టికి తీసుకొచ్చారు. ఈ విషయాన్ని ఎక్సైజ్ శాఖ సిబ్బంది ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. నాంపల్లిలో రోడ్ల పనులు నాణ్యంగా వేయడం లేదని, తిప్పర్తిలో ట్రాన్స్‌ఫార్మర్ల బిగింపులో ఆలస్యం జరుగుతున్నదని, మండల కేంద్ర ప్రభుత్వ పాఠశాలల్లో సబ్జెక్ట్ టీచర్లు లేరని ఆయా మండలాల జడ్పీటీసీలు సభ దృష్టికి తీసుకొచ్చారు. సదరం సర్టిఫికెట్ల జారీలో అక్రమాలు జరుగుతున్నాయని కొందరు సభ్యులు ఆరోపించారు. ఆ తర్వాత మూడో స్థాయీ సంఘం సమావేశం జడ్పీ వైస్ చైర్మన్ ఇరిగి పెద్దులు అధ్యక్షతన, ఐదో స్థాయీ సంఘం సమావేశం ఆ స్థాయీ సంఘం చైర్మన్ కంకణాల ప్రవీణారెడ్డి అధ్యక్షతన జరిగాయి. సమావేశాల్లో డిప్యూటీ సీఈఓ శ్రీనివాస్‌రెడ్డి, జడ్పీటీసీలు, ఎంపీపీలు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

నెలాఖరులోగా సీఎంఆర్ అందించాలి

- సూర్యాపేట కలెక్టర్ వెంకట్రావ్

అధికారులు, మిల్లర్లతో సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ వెంకట్రావ్

సూర్యాపేట, జనవరి 9 : ప్రభుత్వం నిర్దేశించిన గడువులోపు 2022-23 వానకాలం సీఎంఆర్ అందించాలని సూర్యాపేట కలెక్టర్ ఎస్.వెంకట్రావ్ రైస్ మిల్లర్లను ఆదేశించారు. కలెక్టరేట్‌లో మంగళవారం అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డితో కలిసి కస్టమ్ మిల్లింగ్ రైస్‌పై సివిల్ సప్లయ్ అధికారులు, మిల్లర్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎంఆర్ అందించడంలో మిల్లర్లు నిర్లక్ష్యం వహించవద్దన్నారు. ఈ నెల 30వరకు ప్రభుత్వం గడువు విధించిందని, ఈ లోపు పెండింగ్ బియ్యం ఎఫ్‌సీఐకి అందించాలని సూచించారు. 2022-23 వానకాలం సీజన్‌కు సంబంధించి సుమారు 2,10,261.654 మెట్రిక్ టన్నుల బియ్యం అందించాల్సి ఉండగా, ఇప్పటి వరకు 1,63,341.070 మెట్రిక్ టన్నులు ఎఫ్‌సీఐకి అందిందని చెప్పారు. ఇంకా 41,920.584 మెట్రిక్ టన్నుల రైస్ అందించాల్సి ఉన్నదని తెలిపారు. ఈ నెల 30 నాటికి బియ్యం ఇవ్వని మిల్లులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. జిల్లా వ్యాప్తంగా 8 మిల్లుల్లో పెండింగ్ అధికంగా ఉన్నదని, వాటిని నిరంతరం పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో డీఎస్ఓ మోహన్‌బాబు, సివిల్ సప్లయ్ మేనేజర్ రాంపతినాయక్, మిల్లర్లు పాల్గొన్నారు.

దేవాదుల భూసేకరణ వేగవంతం చేయాలి

దేవాదుల ప్రాజెక్టు కాల్వలకు సబంధించి తిరుమలగిరి, నాగారం మండలాల్లో భూసేకరణ వేగవంతం చేయాలని కలెక్టర్ వెంకట్రావ్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో భూ సేకరణపై అధికారులతో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. తిరుమలగిరి, నాగారం మండలాల పరిధిలో కాల్వల తవ్వకాల కోసం 180 ఎకరాల భూమిని సర్వే చేయాలని ఆదేశించారు. ఇందుకోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి, ల్యాండ్ సర్వే రికార్డుల ఏడీ నాగేందర్, దేవాదుల ప్రాజెక్టు ఈఈ ప్రవీణ్, డీఏఓ శ్రీలత, ఆయా మండలాల తాసీల్దార్లు పాల్గొన్నారు.

అందుబాటులో ఆరు తడి విత్తనాలు

- టీఎస్ ఎస్‌డీసీ రీజినల్ మేనేజర్ కృష్ణవేణి

మిర్యాలగూడ రూరల్, జనవరి 9 : యాసంగిలో వరికి ప్రత్యామ్నాయంగా ఆరు తడి పంటలు సాగు చేసేందుకు శుద్ధి చేసిన విత్తనాలు అందుబాటులో ఉన్నాయని నందిపహాడ్‌లోని తెలంగాణ సీడ్స్ కార్పొరేషన్ రీజినల్ మేనేజర్ సీహెచ్ కృష్ణవేణి అన్నారు. తన కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. పెసర, మినుము, వేరుశనగ, మంచి శనగ విత్తనాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. పెసర 4 కిలోల బ్యాగ్ రూ.432, మినుములు 4కిలోలు రూ.424, వేరుశనగ 30 కిలోల బ్యాగు రూ.2,865, మంచి శనగలు 25 కిలోల బ్యాగ్ 1,875 రూపాయల ధరను ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. విత్తనాలు అవసరమున్న రైతులు 9849908757కు ఫోన్ చేయాలని సూచించారు.

సీజ్ చేసిన వాహనాలకు 11న బహిరంగ వేలం

మిర్యాలగూడ, జనవరి 9 : వివిధ కేసుల్లో సీజ్ చేసిన ద్విచక్ర వాహనాలు, ఒక ట్రాక్టర్ ట్రాలీ, ఒక కారును జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి ఆదేశానుసారం ఈ నెల 11న మిర్యాలగూడ ఎక్సైజ్ స్టేషన్‌లో బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఎక్సైజ్ సీఐ మహేశ్వర్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల వారు గురువారం ఉదయం 11గంటలకు వేలంలో పాల్గొనాలని, ఇతర వివరాలకు మిర్యాలగూడ ఎక్సైజ్ స్టేషన్‌లో సంప్రదించాలని పేర్కొన్నారు.

దుర్గా ప్రమీలకు నల్లగొండ డీటీసీగా అదనపు బాధ్యతలు

హైదరాబాద్, జనవరి 9(నమస్తే తెలంగాణ): మహబూబ్‌నగర్ డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్(డీటీసీ) జి. దుర్గా ప్రమీల నల్లగొండ డీటీసీగా అదనపు బాధ్యతలు నిర్వర్తించనున్నారు. ఈ మేరకు ఆమెకు బాధ్యతలు అప్పగిస్తూ మంగళవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

20న జవహర్ నవోదయ ప్రవేశ పరీక్ష

పెద్దవూర, జనవరి 9 : మండలంలోని చలకుర్తి జవహర్ నవోదయ విద్యాలయంలో 2024-2025 విద్యా సంవత్సరానికి 6వ తరగతిలో ప్రవేశానికి ఈ నెల 20న ఎంట్రన్స్ నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ ఆర్.నాగభూషణం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి నల్లగొండ జిల్లా పరిధిలోని పలు సెంటర్లలో ఈ పరీక్ష నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు హాల్ టికెట్లు/ అడ్మిన్ కార్డులను https/navodaya.gov.in వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. ఏమైనా ఇబ్బందులు తలెత్తితే 7794037457కు ఫోన్ చేసి పరిష్కరించుకోవాలని పేర్కొన్నారు.

జాతీయ స్థాయి క్రికెట్ పోటీలకు కొత్తపల్లి విద్యార్థిని

జాతీయ స్థాయి క్రికెట్ పోటీలకు ఎంపికైన పరిశాల శ్వేత

హాలియా, జనవరి 9 : అనుముల మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన పరిశాల శ్వేత ఈ నెల 11 నుంచి 14వ వరకు గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో జరుగనున్న 67వ జాతీయ స్కూల్ ఫెడరేషన్ గేమ్స్ అండర్-19 విభాగంలో బాలికల చాంపియన్ షిప్ జాతీయ స్థాయి క్రికెట్ పోటీలకు ఎంపికైంది. శ్వేత కట్టంగూర్‌లోని ప్రభుత్వ గురుకుల పాఠశాలలో ఇంటర్ చదువుతున్నది. శ్వేత చిన్నతనంలోనే రోడ్డు ప్రమాదంలో తండ్రి నాగరాజును కోల్పోయింది. తల్లి కూలి పని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నది. శ్వేతకు ఒక చెల్లె, ఒక తమ్ముడు ఉన్నారు. వీరు వేర్వేరు గురుకుల పాఠశాలల్లో చదువుతున్నారు. శ్వేత చదువుతోపాటు క్రీడలపై ఆసక్తి చూపేది. అది గమనించిన పాఠశాల పీడీ క్రికెట్‌లో ప్రోత్సహించడంతో జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైంది. ఆమె ఎంపిక పట్ల గ్రామ ఎంపీటీసీ వెంకటయ్య, మార్కెట్ డైరెక్టర్ ఉడ్తూరి శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు పంగ లక్ష్మణ్ యాదవ్, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

వేతన వేదన

సమగ్ర శిక్షా ఉద్యోగులకు 2 నెలలుగా జీతాల్లేవ్

- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 2,192 మంది..
- అప్పులు చేసి విధులకు వెళ్తున్న పరిస్థితి
- కేసీఆర్ సర్కార్‌లో ప్రతి నెలా మొదటి వారంలోనే వేతనాలు
- కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీని నెరవేర్చాలంటున్న ఉద్యోగులు

సమస్యలు పరిష్కరించాలని నల్లగొండ కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు (ఫైల్)

రామగిరి/మునుగోడు, జనవరి 9 : 'అందరూ చదువాలి.. అందరూ ఎదుగాలి' అనే నినాదంతో ముందుకు సాగుతున్న సమగ్ర శిక్షా అభియాన్(ఎస్ ఎస్ఏ)ఉద్యోగులు జీతాలు రాక అవస్థలు పడుతున్నారు. విద్యాబోధనతోపాటు విద్యాశాఖ కార్యాలయాలు, క్షేత్రస్థాయిలో కార్యక్రమాల అమలుకు నిరంతరం కృషి చేస్తున్న వారికి రెండు నెలలుగా జీతాలు రావడం లేదు. కేసీఆర్ సర్కారులో మొదటి వారం రోజుల లోపు జీతాలు పొందేవారు. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఒక నెల జీతం ఆగగా, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నెల దాటినా వీరికి జీతాలు మాత్రం రావడం లేదు. చాలీచాలని వేతనాలతో విధులు నిర్వహిస్తున్న వారు అప్పులు చేసి కాలం వెళ్లదీయాల్సిన పరిస్థితి ఏర్పడింది.

వాటా మంజూరులో జాప్యమే కారణమా?

సమగ్ర శిక్షా నిధులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 60 : 40 శాతంలో మంజూరు చేయాల్సి ఉంటుంది. 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి కేంద్రం తన వంతు వాటా నిధులను జమ చేసిందని, రాష్ట్ర ప్రభుత్వం వాటిని వినియోగించడంతోపాటు తన వాటాను ఇంత వరకు జమ చేయక పోవడంతోనే సమస్య వచ్చిందని ఉద్యోగ వర్గాల్లో చర్చ సాగుతున్నది.

ఎన్నికల్లో హామీ ఇచ్చిన కాంగ్రెస్

సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని, ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా వేతనాలు అందించాలని, రెగ్యులరైజ్ చేయాలనే డిమాండ్లతో గతేడాది సెప్టెంబర్‌లో రాష్ట్ర వ్యాప్తంగా 20 రోజుల కుపైగా సర్వశిక్షా అభియాన్ ఉద్యోగులు సమ్మె చేశారు. తాము అధికారంలోకి వస్తే ఉద్యోగులను రెగ్యులర్ చేస్తామని కాంగ్రెస్ అసెంబ్లీ ఎన్నికల్లో హామీ ఇచ్చింది. ఇచ్చిన హామీని కాంగ్రెస్ ప్రభుత్వం నిలబెట్టుకోవాలని ఉద్యోగులు కోరుతున్నారు.

ఉమ్మడి జిల్లాలో 2,192 మంది ఉద్యోగులు...

ఉమ్మడి నల్లగొండ జిల్లా వ్యాప్తంగా సమగ్ర శిక్షలో 2,192 మంది ఉద్యోగులు కాంట్రాక్ట్ పద్ధతిలో వివిధ హోదాల్లో పని చేస్తున్నారు. నల్లగొండ, సూర్యాపేట, యాదాద్రి భువనగిరి డీఈఓ కార్యాలయాల్లో 31 మంది, మండల మానవ వనరుల కేంద్రాల్లో ఎంఐఎస్ కో ఆర్డినేటర్లు 64, డాటా ఎంట్రీ ఆపరేటర్లు 65, మెసెంజర్లు 65, భవిత సెంటర్లలో ఐఈఆర్‌పీలు 103, కేర్‌గివర్లు 63, స్కూల్ కాంప్లెక్స్ స్థాయిలో పాఠశాలల పర్యవేక్షణ క్లస్టర్ రిసోర్స్ పర్సన్స్(సీఆర్‌పీ) 259, పాఠశాలల్లో పార్ట్‌టైం ఇన్‌స్ట్రక్టర్లు 410 మంది విధులు నిర్వర్తిస్తున్నారు. వీరు కాకుండా కేజీబీవీలో బోధన ఉద్యోగులు 410, బోధనేతర సిబ్బంది 488, అర్బన్ రెసిడెన్షియల్ స్కూల్స్‌లో బోధన సిబ్బంది 36, బోధనేతర ఉద్యోగులు, రూ. 5, 500 నుంచి గరిష్ఠంగా రూ. 25 వేల వరకు నెల వేతనం పొందుతున్నారు. ఇతర సదుపాయాలేమీ వీరికి వర్తించవు. వచ్చే జీతంలో నుంచే బస్సు చార్జీలు, స్టేషనరీ భరించాల్సి ఉంటుంది. వీరిలో కేవలం నల్లగొండ జిల్లాలోనే ఆయా విభాగాల్లో 1,163 మంది ఉండగా మిగిలిన వారు సూర్యాపేట, యాదాద్రిలో ఉన్నారు.

వేతనాలను వెంటనే చెల్లించాలి

రెండు నెలల నుంచి వేతనాలు రాక పోవడంతో ఇబ్బంది పడుతున్నాం. ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా పని చేయించుకుంటున్నప్పటికీ వేతనాలు ఇవ్వడంలో తీవ్ర జాప్యం చేస్తున్నారు. రెండు నెలలుగా కుటుంబ పోషణ భారంగా మారింది. ఇప్పటికైనా నూతన ప్రభుత్వ స్పందించి ఎన్నికల్లో ఇచ్చిన హామీ వేరకు మా సర్వీసును రెగ్యులరైజ్ చేయాలి. అందరు ఉద్యోగులతో సమానంగా ఒకటో తేదీలోపు వేతనాలు ఇవ్వాలి.

– తిరందాసు సంతోష్‌కుమార్, సమగ్ర శిక్షా కాంట్రాక్ట్ ఉద్యోగుల సంఘం, నల్లగొండ జిల్లా అధ్యక్షుడు

తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుతున్నాం

ఒడిశా, మహారాష్ట్ర, హర్యానాలో మాలాంటి ఉద్యోగులను అక్కడి ప్రభుత్వాలు క్రమబద్ధీకరించాయి. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఉద్యోగ భద్రత కల్పిస్తామని హామీ ఇచ్చింది. నెరవేర్చి న్యాయం చేయాలి. గతంలో ఉద్యోగ భద్రతకు ధర్నాలు చేస్తే ప్రస్తుతం వేతనాల కోసం ఆందోళన బాట పట్టాల్సి వస్తుండడం బాధాకరం. సమగ్రశిక్షా మహిళా ఉద్యోగులకు ప్రసూతి సెలవులు కూడా ఇవ్వడంలేదు.

– బృహిణి – సీఆర్‌పీ, తిప్పర్తి మండలం, నల్లగొండ జిల్లా

పుస్తక పఠనంతో జ్ఞాన సముపార్జన

- ఎన్‌జీ కాలేజీ ప్రిన్సిపాల్ సముద్రాల ఉపేందర్

ఎన్‌జీ కాలేజీలోని గ్రంథాలయానికి బహూకరించిన పుస్తకాలను ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపాల్ ఉపేందర్, అధ్యాపకులు

రామగిరి, జనవరి 9 : పుస్తక పఠనంతో ఎంతో జ్ఞానం పెరుగుతుందని, ఇందుకు నిదర్శనం గ్రంథాలయాలని ఎన్‌జీ కాలేజీ ప్రిన్సిపాల్ సముద్రాల ఉపేందర్ అన్నారు. నల్లగొండలోని నాగార్జున ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని గ్రంథాలయానికి మంగళవారం సుల్తాన్ చాంద్ ట్రస్ట్ న్యూఢిల్లీ వారు 568 పుస్తకాలను బహూకరించారు. భౌతిక, రసాయన, గణితం, వాణిజ్య, ఆర్థిక శాస్త్రం పుస్తకాలను అందజేయగా, వాటి విలువ రూ.2,48,575 ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థులు గ్రంథాలయంలోని పుస్తకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కళాశాల గ్రంథాలయ శాస్త్ర అధ్యాపకుడు ఆనందం దుర్గాప్రసాద్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ మునీరొద్దీన్, అధ్యాపకులు శ్రీనివాస్, నాగరాజు, శ్రీనివాస్‌రెడ్డి, ప్రవీణ్‌రెడ్డి, నక్క నర్సింహ పాల్గొన్నారు.

మరిన్ని జిల్లా వార్తలు 8వ పేజీలో